నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 2 మార్చి 2024 | ADILABAD

# యాట్ల స్రవంతికి డాక్టరేట్



యాట్ల స్రవంతి

మంచిర్యాలటౌన్, మార్చి 1: కాకతీయ విశ్వ విద్యాలయ వృక్షశాస్త్ర విభాగ పరిశోధకురాలు యాట్ల స్రవంతి డాక్టరేట్ అందుకున్నది. ఇటీవల కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నర్సింహాచారి ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ యాట్ల స్రవంతి 'ఇన్‌విట్రో క్లోనల్ ప్రొపగేషన్ అండ్ జెనెటిక్ ఫెడిలిటీ ఇన్ సెమికార్పస్ అనకార్డియమ్ ఎల్ . ఎఫ్' అనే అంశంపై విభాగ ఆచార్యులు ఎండీ ముస్తఫా పర్యవేక్షణలో తన రీసెర్చ్‌ను పూర్తిచేశారు. ఇటీవల నిర్వహించిన సెమినార్‌లో ఆమె రీసెర్చ్ వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పిట్టల వాడకు చెందిన యాట్ల స్రవంతి అక్కడే ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేసింది. కాకతీయ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, సాయిరాం డిగ్రీ కాలేజీలో బీఎస్సీ బీజెడ్సీ, కరీంనగర్‌లోని ఎస్‌ఆర్ఎం కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా స్రవంతిని బోధన, బోధనేతర సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

# ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి : నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

దిలావర్‌పూర్, మార్చి 1: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించి, బాధితులకు సరైన న్యాయం చేయాలని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి, స్టేషన్ పరిధిలో నేరాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల అసభ్య కరంగా మాట్లాడవద్దని, వారితో మర్యాదగా మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, వాటి గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆర్థిక సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మండలంలో ఏవిధమైన అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, శివరాత్రి సందర్భంగా కదిలి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఐ సుమాంజలి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు


అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్


మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

## కేసీఆర్‌పై కోపంతో..
# రైతులపై పగబట్టకండి

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.


మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు


మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు


ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు


మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, తదితరులు

# రైతులను పగ పడుతారా?

- బీఆర్ఎస్ పార్టీపై కోపంతో వారిపై కక్ష సాధించవద్దు
- కాళేశ్వరంపై పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం సరికాదు
- వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టండి
- 'చలో కాళేశ్వరం'లో నాయకులు

మంచిర్యాల, మార్చి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో పడావుబడ్డ భూములన్నీ సస్యశ్యామలం అయినయి. 15 రిజర్వాయర్లు, వేల కిలోమీటర్ల కాలువలు, వంద కిలోమీటర్ల సొరంగ మార్గాలు, నీటి ఎత్తిపోతలతో యావత్ ప్రపంచమే ఆశ్చర్యపోయేలా ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత కేసీఆర్ సర్కారుది. అలాంటి విశ్వఖ్యాతి పొందిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ పనిగట్టుకొని దుష్ప్రచారం చేయడం సరికాదు. మరమ్మతులు చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నా పట్టించుకోకుండా రాజకీయాలు చేస్తున్నారు. వరదలు వచ్చేలోగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. కాళేశ్వరంపై ఆధారపడి పంటలు వేసిన రైతులు ఆగమైపోతున్నారు. బీఆర్ఎస్‌పై కోపంతో రైతులను పగ పడుతారా.' అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చలో కాళేశ్వరం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, నాయకులు శుక్రవారం మేడిగడ్డ బ్యారేజ్‌ని పరిశీలించారు. ఇప్పటికైనా స్పందించకపోతే రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

### కాళేశ్వరంపై కావాలనే విష ప్రచారం

కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చింది. వాటిని అమలు చేయకుండా జనం దృష్టిని మరల్చేందుకు కాళేశ్వరంపై అర్థంలేని ఆరోపణలు చేస్తున్నది. తెలంగాణ ముఖ చిత్రాన్ని మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కావాలనే పనిగట్టుకొని విషప్రచారం చేస్తున్నది. మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూపిస్తున్నారు. బీఆర్ఎస్‌పై కోపముంటే రాజకీయంగా కొట్లాడాలి. కానీ లక్షలాది మంది రైతులను గోస పెట్టడం సరికాదు. మేడిగడ్డకు వెంటనే మరమ్మతులు చేసి తీరాలి. ఈ విషయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం.

- బాల్క సుమన్, మాజీ ప్రభుత్వ విప్

# రేపటి నుంచి 'పల్స్ పోలియో'

- నిర్మల్ జిల్లాలో 86,290 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు
- 543 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 1: పోలియో మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 3 నుంచి మూడు రోజుల పాటు 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల మందు వేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, ప్రయాణ ప్రాంగణాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొబైల్ టీంలు ఏర్పాటు చేశారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణ పనులు చేసుకునే కార్మికుల పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తారు. ఈ నెల 3న చుక్కల మందు వేసుకోని వారికి 4,5 తేదీల్లో అవకాశం ఉంటుంది. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి పోలియో చుక్కలు వేసుకోని వారికి వేస్తారు. జిల్లాలో సుమారు 86,290 మంది 5 ఏళ్ల లోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. ఇందుకు గాను 543 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకుగాను వ్యాక్సిన్ వాయిల్స్ జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. సంచార బృందాలు ఏర్పాటు చేశారు.

# 'ఖాళీల' గందరగోళం

## డీఎస్సీపై అభ్యర్థుల్లో అయోమయం

- పోస్టుల తక్కువ చూపారంటూ ఆందోళన
- డీఈవో నిర్లక్ష్యమే కారణమంటూ మండిపాటు తీవ్రంగా నష్టపోయామంటున్న నిరుద్యోగులు
- పూర్తిస్థాయి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్
- ఆదిలాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత


జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట నిరుద్యోగులు ఆందోళన


ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారి ప్రణీతను నిలదీస్తున్న నిరుద్యోగులు

ఆదిలాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉన్నా, జిల్లా విద్యాశాఖ అధికారులు తక్కువ చూపారంటూ నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. జిల్లా విద్యాధికారి ప్రణీతను కలిసి ఖాళీల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో 324 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ 209, సెకండరీ గ్రేడ్ టీచర్ (స్పెషల్ ఎడ్యుకేషనర్స్) 19, స్కూల్ అసిస్టెంట్లు 80, లాంగ్వేజ్ పండిట్లు 14, పీఈటీ పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను డీఈవో కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. జిల్లాలో గత డీఎస్సీ ప్రకటనతో పోల్చితే కేవలం మూడు ఎస్జీటీ పోస్టులు మాత్రమే పెరగడంతో, ఎన్నో రోజులుగా ఉపాధ్యాయ నియామక ప్రకటన కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నిరాశ ఎదురైంది. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టుల సంఖ్య వందల సంఖ్యలో పెరిగితే, ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం స్వల్పంగా పెరిగిందని, ఇందుకు అధికారులే కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఎస్జీటీ పోస్టులు 3 మాత్రమే..

బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లా వ్యాప్తంగా 275 ఖాళీలు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో ఎస్టీటీలు 206, స్కూల్ అసిస్టెంట్లు 54, లాంగ్వేజ్ పండిట్లు 13, పీఈటీలు 2 ఉన్నాయి. ఈ సారి వెలువడిన ప్రకటనలో పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు పెరిగాయి. ప్రధానంగా గత నోటిఫికేషన్‌లో ఎస్జీటీ ఖాళీలు 206 ఉండగా, గురువారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 209 చూపించడం అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. గత నోటిఫికేషన్, ప్రస్తుత నోటిఫికేషన్ చూస్తే సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు కేవలం 3మాత్రమే పెరగడం అభ్యర్థుల్లో అనుమానాలకు కారణమైంది. గత నోటిఫికేషన్‌తో పోలిస్తే, ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో 50, మంచిర్యాల జిల్లాలో 51 పోస్టు లు పెరిగాయని, ఆదిలాబాద్ జిల్లాలో కేవలం 3 మాత్రమే ఉందని అభ్యర్థులు మండిపడుతున్నారు. జిల్లా విద్యాధికారి పోస్టులను తక్కువగా చూపడం వల్లే తాము ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం వెలువరించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్జీటీ పోస్టుల సంఖ్య పెరిగిలా చూడాలని నిరుద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

### మెగా కాదు.. దగా డీఎస్సీ



*జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వం చెబుతున్న మెగా డీఎస్సీ మాకు దగా డీఎస్సీగా మారింది. నేను 2014లో డీఎడ్ పూర్తి చేసి డీఎస్సీ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నా. ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని పదేళ్లుగా కష్టపడి చదువుతున్నా. ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరిట ప్రకటించిన నోటిఫికేషన్‌లో ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ ఎస్జీటీ పోస్టులు ఉంటాయని ఆశపడ్డాం. ఈ ప్రకటన 33 జిల్లాలో నిరుద్యోగులకు లాభం చేకూర్చగా, ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులకు మాత్రం నిరాశ మిగిల్చింది. జిల్లా విద్యాశాఖ అధికారులు ఖాళీల సంఖ్య సరిగా చూపకపోవడంతో అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగం రాకుండా పోతున్నది.*

**-విక్రమ్ సింగిడి, నిరుద్యోగి, బెల్లూరి, ఆదిలాబాద్ రూరల్ మండలం**

### మా జీవితాలతో చెలగాటం



*జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల వివరాలు సరిగా పంపక మా జీవితాలతో ఆడుకుంటున్నారు. జిల్లా విద్యాధికారిని నోటిఫికేషన్‌లో పోస్టుల సంబంధించి అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. నేను 2017లో డీఎడ్ పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నాను. టీచర్ పోస్టు సాధించడానికి ఏడేండ్ల నుంచి కష్టపడి చదువుతున్నాను. ఎస్జీటీ పోస్టుల విషయంలో విద్యాశాఖ అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో నిరుద్యోగులకు అన్యాయం జరిగింది. జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల విషయంలో ప్రభుత్వం స్పందించాలి.*

**- శైలేశ్, నిరుద్యోగి, ఆదిలాబాద్**